

# గంగావతరణం

సున్ని అచ్యుతరావు
వేమకోటి సీతారామశాస్త్రి

రాంబాబు యింట్లో అడుగు పెట్టేసరికి, వదినగారు హరికేన్ లాంతరు వెలిగిస్తున్నాది. రివాజుగా మంగళ సూత్రం కళ్ళకద్దుకుంటున్నాది. ఆమె నుదిటిమీద యెర్రని కుంకుమలో చెమ్కీ, ఒంటిరాతి ముక్కుపుడక కాంతిలో ప్రతిబింబిస్తున్నది. అన్నయ్య, ఉయ్యాల మంచంమీద కూర్చొని, పిల్లలచే అమరం వల్లె వేయిస్తున్నాడు, జంధ్యాలు వడుక్కుంటూ. దేవతార్చన గదిలో నేతిదీపాలు వెలుగుతున్నాయి. తండ్రి గౌళకంఠంతో "హిరణ్యవర్ణాం హరిణీం" ... శ్రీ సూక్తాన్ని, పఠిస్తూ, రాజరాజేశ్వరిని, అర్చిస్తున్నాడు. అగరవొత్తుల పొగ, మెల్లగా గాలితో ఆడుకుంటూ, సువాసనలు వెదజల్లుతూ, విశ్వంలో కరిగిపోతున్నాయి. అన్నయ్యదగ్గర పిల్లలు రాంబాబును చూడగానే, 'బాబాయ్' అంటూ చుట్టుకున్నారు. శ్లోకాలు సగంలో ఆగిపోయాయి. అన్న

దమ్ముల మధ్య కుశల ప్రశ్నల అనంతరం, దేవతార్చన గదిలో గంట మోగింది; కర్పూర హారతులమధ్య. అనాలోచితంగానే, అతనూ, అన్నగారు చేతులెత్తి నమస్కరించారు పరదేవతకు, నిమీలిత నేత్రులై.

"ఏమోయ్! ఎలా రాసావ్ పరీక్షలు?" కంచుకంఠం సింహగర్జనలా. మెడలో రుద్రాక్షలు, పట్టెడు విభూతి రేఖలు పరమశివునిలా తండ్రి. అవనత వదనుడయ్యే చెప్పేడు సమాధానం రాంబాబు.

* * *

అర్ధరాత్రి కలత నిద్దురలో తెలివి వచ్చింది, రాంబాబుకు. అగ్రహారమంతా సందడిగా వుంది. చల్లగా వుండవలసిన రాత్రి విపరీతమైన వుక్క. మగవాళ్ళు కావిళ్ళు, ఆడవాళ్ళు బిందెలతో మడిగా నీళ్ళు మోసుకొస్తున్నారు రాంబాబు కలవరపడ్డాడు. ఈ కోలాహలం యీనాటిదా? ఎన్నో సంవత్సరాలనుండి వస్తున్నది. తాను చిన్నతనంనుండే చూస్తున్నాడు. తనవూరుచుట్టూ వుండే చిన్న చెరువులన్నీ వర్షాకాలంలో నిండి శీతాకాలంవరకు పుష్కలంగా నీరు అందిస్తాయి. వేసవికాలంలో ఎండలు బాగా ముదిరేటప్పటికి యెండిపోతాయి. అపుడు వూళ్ళోని అందరికీ, మళ్ళీ వర్షాలు పడేటంతవరకూ ఆ నుయ్యేగతి. ఊళ్ళో వున్న ఒకే ఒక నుయ్యి అది. ఆ ఊరికి ఏ కాలువలూ లేవు.

ఆ సంవత్సరము ఎండలు మండిపోతున్నాయి. మండువేసవి. ప్రజలు నీటికోసం కటకటలాడే దినాలు. నీరు అమృతంలా భావిస్తున్నారు. బంగారంలా వాడుకుంటున్నారు

విశాల ప్రపంచంలో అందరూ ఒక ఆకాశంక్రింద జీవిస్తూ, ఒకేగాలి పీలుస్తూన్నా, ఆ నూతిలో నీరుమాత్రం అందరూ ఒక్కసారి వాడుకోగూడదు. ఆ నూతిదగ్గర తగవులు ప్రతిసంవత్సరం తాను ఊళ్ళో వున్నప్పుడు చూస్తునే వుండేవాడు. ప్రణాళికా పథంలో దేశం ఎంత పురోభివృద్ధి పొందుతున్నా, కొత్త సొగసులు సంతరించుకుంటున్నా, ఆ ఊరుమాత్రం మారలేదు!

ఇంకో నుయ్యి తవ్విస్తే నీటియెద్దడి తగ్గేది. కాని ఆ ఊళ్ళో భాగ్యవంతులు, పలుకుబడి కలవాళ్ళు యెవ్వరూ అలాంటి చర్యకు పూనుకోలేదు. కారణం తెలియదు. బహుశా వారి అవసరాలు తీరిపోతున్నా యనేమో! ఎవరి బ్రతుకు వారిది. చలనం, చైతన్యం, అభ్యుదయంవేపు పురోగమించని మనస్తత్వాలు గల స్తబ్ధ జీవితాలు వారివి.

రాంబాబుకు ఆలోచనలతోనే పంచ పంచ ఉషఃకాలమై పోయింది. రాంబాబు హృదయంలో, మస్తిష్కంలో మెరపులాంటి ఆలోచనలు, ఆశయాలు తళుక్కుమని మెరశాయి. దేవతార్చన గదిలో తండ్రి గంటవాయిస్తూ, మహన్యాసపూర్వ




కంగా అభిషేకం చేస్తూ దేవతార్చన చేస్తున్నాడు. రాంబాబు లేచాడు, అప్పటికే ఆలస్యం అయిందనుకుంటూ.

"ఏమయ్యా! చదువయిపోయింది కదా. ఈ సంవత్సరమైనా పెళ్ళిచేసుకుంటావా?" అంది వదినగారు రాంబాబు చేతికి కాఫీ యిస్తూ. రాంబాబు వదినగారి ప్రశ్నకు సమాధానంగా చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.

ఊళ్ళోకి రాంబాబు బయలుదేరాడు ఊరు ఏమీ మారినట్లు కనిపించలేదతనికి. చిన్ననాటి మిత్రులు బంధువులు. అందరూ ఏవేవో మాట్లాడారు. కొందరు ఉద్యోగం ఎప్పుడు వస్తుందన్నారు వారందరికీ సమాధాన మిస్తూ నాయుడుగారింటి కెళ్ళాడు.

ఊరికి పెద్ద, మనసుకు చిన్న నాయుడుగారు! ఆయనచుట్టూ పదిమంది కాకారాయుళ్ళు కూర్చొని యిష్టాగోష్టి చేస్తున్నారు. ఏభై యేళ్ళు వచ్చినా నాయుడిగారి శరీరంలో జవసత్వా లింకా తగ్గిపోలేదు. కోరమీసాల వెనుక మగసిరి, అగ్నిగోళాల్లాంటి కళ్ళతో ఆకలిగొన్న పెద్దపులిలా వుంటుం దాయన చూపు

నాయుడుగారిని చూసి "నమస్కారం నాయుడుగారూ" అన్నాడు రాంబాబు. "ఎవ రీతను!" అన్నట్లు ఆశ్చర్యంగా చూశాడు నాయుడు. అందులో ఒకడు "పతంజలి శాస్త్రిగా రబ్బాయి'' అని చెప్పాడు.

"ఓహో! నువ్వా! రా...కూర్చో. పట్నంలో ఇంజనీరు చదివింది నీవే కదూ!" అన్నాడు నాయుడు. కమతగాడు కుర్చీవేశాడు కుర్చీలో కూర్చున్న

రాంబాబువేపే చూస్తున్నాడు. నిశ్శబ్దం క్షణాలను పారదోలుతోంది రాంబాబు ఎందు కొచ్చిందీ ఎవ్వరికీ అర్థం కావటం లేదు. రాంబాబే ప్రారంభించాడు సంభాషణ

"చూడండి నాయుడుగారూ! మీరు పెద్దవాళ్లు. మీకు తెలియం దేమీలేదు. మనవూళ్ళో ఇంకోనుయ్యి లేక ప్రజలు అందరూ నానాబాధపడి పోతున్నారు మనవూళ్ళో ఇంకో రెండు మూడు నూతులు తవ్విస్తే శాశ్వతంగా మనకు నీటి కరువు నివారణయిపోతుంది కనీ సం ముందు మనం ఒకనుయ్యి అయినా తవ్విస్తే కొంతబెడద తగ్గుతుంది. ఊరికి పెద్ద, అన్నిరకాలుగా వున్నవారు, మీరు తలుచుకుంటే యీపని చిటికెలో నెరవేరిపోతుంది. నే నన్ని విధాలా సహాయపడతాను" అన్నాడు బ్రతిమాలే ధోరణిలో రాంబాబు.

శ్రోతలంతా చెవులు రిక్కించుకుని విన్నారు. అతను చెప్పింది ముఖ్యమైనది, అత్యవసరమైనదని తెలుసు. అయితే నాయుడేం చెపుతాడో నని ఎదురు చూస్తున్నాయి వారి మనస్సులు. గట్టిగా నవ్వేశాడు నాయుడు కోరమీసం సవరించుకుంటూ.

"ఉన్న నుయ్యి సాల్లేవయ్యా! మీ బాపనోళ్ళకి మడిగా నుయ్యి కావాలేటి! పెద్ద సెప్పొచ్చావ్. నాకు తెలుసు లేవయ్యా మా ఊరుకేటి కావాలో. పెద్ద నాయకుడిలా బయలుదేరావ్" అని ఈసడించేశాడు. అక్కడున్న పదిమందీ దానికి వంతపాడారు మనస్సులో ఇష్టం లేకుండానే. అర్థంలేని నవ్వు హాలంతా ప్రతిధ్వనించింది.

అవమానంతో లేచి వచ్చేశా డక్కడ నుండి రాంబాబు. ఇంకా వూళ్ళో యింతో అంతో పెద్దలనబడే వాళ్ళందరి దగ్గరికీ వెళ్ళాడు. కాని వాళ్ళందరూ నాయుడు మీదే భారంవేశారు. తాను నాయుడు సంగతి చెప్పాడు.

"అయ్యబాబోయ్! వాడ్ని ఎదిరించి బతకడమే" అన్నారు కొంతమంది, సాయం చేద్దామన్న వుద్దేశం కలిగినా. ఇలా రాంబాబు ప్రయత్నం నీరుగారి పోయింది.

సాయంకాలం రాంబాబు మాలపల్లె వేపు వెళ్ళాడు. అతుకులబొంతల్లా వున్న గుడిసెలు, జీర్ణవస్త్రాలతో ఎముకలు కన్పిస్తూ బయట ఆడుకొంటున్న పిల్లలు, వాడంతా మురికిగా, గజిబిజిగా, అసహ్యంగా వుంది. అందరూ రాంబాబు వేపే వింతగా చూస్తున్నారు. కూలిపనుల నుండి తిరిగి వస్తున్న కొంతమంది రాంబాబుకు నమస్కరిస్తున్నారు.

"వాడ పెద్ద యెవరని" అందులో ఒకరిని అడిగాడు రాంబాబు.

"వాడ పెద్ద వీరయ్య సచ్చిపోయాడు బాబూ!" అన్నాడతడు రాంబాబువంక ఆశ్చర్యంగా చూస్తూ.

"బాబూ! తమకేటి కావాలి" అన్నాడింకొకడు వినయంగా.

"ఏంలేదు, మీ అందరితో ఒకసారి మాట్లాడాలి" అన్నాడు వాళ్ళందరి ముఖాలు చూస్తూ.

అందరూ మర్రిచెట్టుకింద రచ్చబండ దగ్గరకు చేరారు.

రాంబాబు నిల్చున్నాడు మాట్లాడ డానికి. అతని ముఖంలో ఆవేదన, ఆవేశం నిండుకున్నాయి.

"వీరయ్య ఎందుకు చనిపోయాడో మీకు తెలుసా?" గంభీరంగా వుంది రాంబాబు కంఠం.

అంతా తెల్లముఖాలు వేశారు. ఎందుకు సచ్చిపోయాడంటే ఏం చెప్పగలరు?

భూమ్మీద నూకలు చెల్లిపోయి సచ్చిపోయాడని చెప్పగలరా?

రాంబాబే మళ్ళీ ప్రారంభించాడు. "ఏమున్నా, ఏంలేకపోయినా, కనీసం నీరైనా లేకపోతే మానవులు బ్రతకటం కష్టం. చివరిక్షణంలో వీరయ్యకు నీరు ఇవ్వలేకపోయారు మీరంతా సమయానికి. మీకు అగ్రహారం నూతిలో నీరు ఎప్పుడూ దొరకదు. ఇంకొకరి దయాధర్మాలమీద ఆధారపడి వుండాలి. కనీసం వాడ సరి హద్దులోనైనా ఒక నుయ్యివుంటే, మీకే గాక యితరులకుగూడా ఎంతో సహాకరిస్తుంది. ఆలోచించండి" అన్నాడు రాంబాబు.

నిజమే. నుయ్యివుంటే బాగుంటుంది. కాని యెలా? నుయ్యి అంటే మాటలు కాదు.

క్షణకాలం మౌనం రాజ్యమేలింది.

"బాబూ! నుయ్యంటే మాటలా! ఎంతో డబ్బుకావాలి. తవ్వడానికి జనం కావాలి. మేం రోజూకూలి చేసుకోక పోతే మా బ్రతుకు నడవదు," అన్నాడు గుంపులోనుండి ఒకడు లేచి.

"ఇదయ్యే పనికాదు బాబూ!" అన్నాడింకొకడు.

"నేను నాయుడిగారితోను, వూళ్ళోని మరికొంతమంది పెద్దలతోను సంప్రదించాను. కాని వారు అనుకూలంగా లేరు. కష్టపడి మనమే నుయ్యి తవ్వకోవాలి. గత్యంతరంలేదు. మీరంతా ఆలోచించి నిర్ణయానికి రండి'' అన్నాడు రాంబాబు.

"బాబూ! ఆ నాయుడు సెండశాస నుడు. ఆడిమాట కాదని మనం ప్రారంభిస్తే అగ్గయిపోతాడు ... యేమైనా సేస్తాడు" అన్నాడొక పిరికి హృదయం.

"సంపేస్తాడు - నాయుడి కెదురు తిరిగితే" అన్నాడింకొకడు సపోర్టుచేస్తూ.

"ఆడు సంపేస్తాడు, యీడు సంపేస్తాడు అనుకుంటూ మనం బ్రతకటం అనవసరం. ఏకంగా యిక్కడే అందరమూ గన్నేరుకాయలు తిని సద్దాం ... ఆ బాబు సెప్పింది సరిగా వినండి. మన కోసమే చెబుతున్నాడు. నీటికోసం ఏటికీ పేనాల్ని బలిపెడుతున్నాం. మనమంతా కలిసి యేదైనా మార్గం ఆలోసించాలి'' అందొక కంఠస్వరం సన్నగా.

రాంబాబుకు ఆ మాటలు అమృతంలా అన్పించాయి. ఉత్సాహం ఉరకలు వేసింది.

"భలే సెప్పావు గంగా! వాడపెద్ద కూతురనిపించుకున్నావు" అన్నాడొక వృద్ధుడు.

రాంబాబు ఆమెవంక చూశాడు. అశ్రుపూరిత నయనాల్తో వడలిపోయిన లంపాలతలా ఉందామె. బహుశా నీరులేక వీరయ్య చచ్చిపోయిన దృశ్యం ఆమె కనులలో కదలివుండవచ్చు అనుకున్నాడు రాంబాబు.

గంగమాటలకు గుంపులోనుండి కలకలం బయలుదేరింది ఎవరికి వారు మనసుల్లో ఆలోచనల సాలెగూళ్ళు అల్లుకో సాగారు.

"మీరేం అనుకోనంటే నాకో ఆలోచన వుంది. మీరెలాగూ కూలీనాలీ చేసుకొని సాయంకాలానికి ఇళ్ళకు రాగలరు. రాత్రికి వాడంతా కలిసి పనులు ప్రారంభిద్దాం. వీలయితే పగలుకూడా ఒకపూట పనుల్లోకి వెళ్ళడం మాని, ఒకపూట ఆకలితో ఉండైనా మనవారికోసం. మన పిల్లలకోసం త్యాగం చేద్దాం. నుయ్యి తవ్వుకుందాం ఒకరితో లెక్కలేకుండా మన నీళ్ళు మనం తాగుదాం" అన్నాడు రాంబాబు ఉత్సాహం నిండిన ఉద్వేగంతో.

"ఆ బాబు సెప్పిందే బాగుంది. మా ఆడాళ్ళం కూడా సాయశక్తులా సాయం సేస్తాం" అందొక స్త్రీ కంఠం ఉత్సాహంగా.

అప్పుడే అక్కడున్న వాళ్ళందరి కనుల్లో నుయ్యి తవ్వుకొని, నీళ్ళు తోడుకుంటున్నట్లు, అవతలిహద్దు అగ్రహారం వారు వింతగా చూస్తున్నట్లుగా దృశ్యం కదులుతోంది.

"ప్రమాణం చేయండి పాదాలమ్మ సాక్షిగా" అంది గంగ గంభీరంగా అందరివేపు చూస్తూ.

అందరూ ప్రమాణం చేసారు ముక్తకంఠంతో.

రాంబాబుకు వేయి ఏనుగుల బలమొచ్చింది. మరునాడు సాయంకాలానికి తాటితోపు ప్రక్కన పాదాలమ్మగుడికి యాభైగజాల దూరంలో అగ్రహారం సరిహద్దున రాంబాబు నూతికి ప్లాను రాశాడు.

మాలపల్లెలోని జనమంతా వుత్సాహంతో పాదాలమ్మకి కొబ్బరికాయకొట్టి నుయ్యి తవ్వకం ప్రారంభించారు. రాంబాబు వారికి సలహాలిస్తూ పర్యవేక్షణ జరుపుతున్నాడు. మగవాళ్ళు గునపాలతోను, పారలతోను మట్టి తీస్తుంటే, ఆడవాళ్ళు తట్టలకెత్తి మోస్తున్నారు. పిల్లలంతా చుట్టూచేరి సందడిచేస్తున్నారు. పల్లె పల్లంతా కోలాహలంగా వుంది

ఈ సంగతి అగ్రహారంలో రాంబాబు ఇంటిలోకూడా తెలిసిపోయింది. నాయుడి



దాకా వెళ్ళండి. నాయుడు విని చిన్నగా నవ్వుకున్నాడు.

* * *

"నువ్వు ఏదో తవ్విస్తున్నావటగా మన ప్రయోజనమంతా వెలగబెట్టి!" భోజనాల సమయంలో రాంబాబు తండ్రి వెటకారంతో కూడిన ప్రశ్న. రాంబాబు మౌనంగా మెతుకులు కతుకుతున్నాడు.

"ప్లానిస్తే ఇచ్చావుగాని, నువ్వేందుకురా అక్కడ రాత్రింబవళ్ళు వాళ్ళ మధ్య!" అన్నాడు అన్నయ్య శుద్ధ శోత్రియంగా.

రాంబాబుకు కోపం వచ్చింది. సమాధానం చెప్పేలోగానే పిల్ల ఏడ్వటంతో సంభాషణ కంతరాయం కలిగింది.

వికలమైన మనస్సుతో బయల్దేరాడు. పాదాలమ్మ గుడిముందు నీళ్ళూ, వేప మండలూ వున్నాయి. తాటితోపు వద్దకు వెళ్ళాడు. ఆశ్చర్యం. తాటితోపంతా నిర్మానుష్యంగా వుంది. విరబోసుకున్న

తాటిచెట్లు దెయ్యాల్లా కరుగుతున్న చీకట్లో కన్పిస్తున్నాయి.

"బాబూ!" గంగ పిలుపు.

చేతిలో లాంతరు, నెత్తిమీద పారతో తట్టపరంలా ప్రత్యక్షమైంది గంగ.

"బాబూ! వాడలోవాళ్ళంతా మంగ ళారం పాదాలమ్మ పండుగ చేసుకుని తప్పతాగేసి పడుకున్నారు" అంది లాంతరు రాతిమీద పెడుతూ.

"నువ్వా, గంగా!" అన్నాడు రాంబాబు ఆశ్చర్యంగా. అతని కళ్ళ ముందు పాదాలమ్మ ప్రమాణం జ్ఞాపక మొచ్చింది.

"అవును బాబూ! నేనే. మీరు తవ్వండి నేను మోస్తాను" అంది దృఢంగా. రాంబాబు తవ్వడం ప్రారం భించాడు. అరగంట గడిచేటప్పటికే రాంబాబు చేతులు బొబ్బలెక్కిపోయాయి. ఒళ్ళంతా చెమటపట్టింది స్నానంచేసి నట్లుగా. చమటలెక్కిన శరీరం అల వాటు కాని అనుభవంతో వణికిపోతోంది. పట్టుదలముందు ఓడిపోయి.

గంగ ఆత్రంగా అతని చేతులు పట్టు కుంది. అవి లాంతరు వెలుతుర్లో పద్మాల్లా కనిపించాయి. గంగ కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది.

"బాబూ! పొరపాటయిపోయింది. దేవుల్లాంటి మిమ్మల్ని కాని పని సేయిం చాను. పదండి మీద కెళ్ళిపోదాం... పనాపేసి" అంది. ఇద్దరూ మీదకు వచ్చే శారు కొంతవరకు తవ్విన నూతిలో నుండి.

తొందరగా నడిచివెళ్ళి, పాదాలమ్మ గుడివద్ద వేపాకుపసరు తీసుకువచ్చి రాసింది. మట్టిలో మాణిక్యంలా గంగ కళ్ళు ఆ చిన్న వెలుగులో మెరుస్తు న్నాయి తడితోను, పశ్చాత్తాపంతోను.

జుత్తు విరబోసుకున్న దెయ్యంలా, గాలితో విరుచుకుపడుతున్నాది గుడి ముందున్న వేపచెట్టు.

"బాబూ! లేచి మెల్లిగా యింటికి వెళ్ళండి" గంగ ఆవేదనతో లాంతరు తీసుకుని లేచింది. అలవాటులేని శ్రమతో నీరసించిన రాంబాబు లేవలేకపోయాడు.

గంగ ఆసరాతో అగ్రహారం మొగ దల వరకూ నడిచి, గంగని మాలపల్లె వెళ్ళిపొమ్మని తాను ఇంటికి చేరుకున్నాడు. విపరీతమైన అలసటతో మంచంపై వాలిపోయిన రాంబాబుకు ఒళ్ళు తెలియని నిద్రపట్టింది.

ఉదయం బాగా ప్రొద్దెక్కిపోయింది. రాంబాబుకు తెలివి వచ్చేసరికి-తండ్రికీ, అన్నయ్యకూ ఇంట్లో జరుగుతున్న వాగ్యుద్ధం గట్టిగా విన్పిస్తోంది.

"నేను చూడలేదు. చూసినవాళ్ళు చెప్పారు. ఎవర్తో వీధి మొగదలవరకూ వచ్చి దిగబెట్టిందట. మనం పురో హితులం. సచ్ఛీలతను, సత్యవాక్కును, అలవరచుకుని నలుగురికీ నాలుగు విష యాలు చెప్పి, శాసించి, అర్థించి,

ఆర్జించుకుని బ్రతుకుతున్నాం. వాడికి ఇంజనీరింగు చదువొద్దురా అంటే ఒప్పు కున్నావు కాదు. సాంప్రదాయాన్ని, జీవనధర్మాన్ని, కట్టుబాట్లను, ఆచారాలను అవతలకు నెట్టివేసి, మన సంస్కృతిని మరచిపోయి భ్రష్టుడై...అమ్మా రాజ రాజేశ్వరీ! నేనింక ఆశుభం పలకలేను" ఆవేశంతోను, ఆగ్రహంతోను వణికి పోతూ రుద్ధమయిన కంఠంతో మరి మాట్లాడలేకపోయాడు పతంజలిశాస్త్రి.

"వాణ్నింక వెళ్ళనివ్వను నాన్న గారూ!" అంటున్నాడన్నయ్య సర్దుబాటు ధోరణిలో.

"నీకు తెలియదురా! వేరుతో పాతు కున్న మొక్క మహావృక్షమై పోతుం దిరా! వయస్సులో నిర్ణయించుకున్న ఆశయం మహా ప్రవాహం లాంటిది బాబూ''...అన్నాడు తండ్రి పతంజలి శాస్త్రి. తన వయస్సులోని అనుభవాన్ని మాటల్లో యిమిడ్చి

రాంబాబుకు ఏడుపువచ్చినంత పని యింది. తాను ఏం తప్పుపని చేశాడని తండ్రి అంతగా బాధపడుతున్నాడు. చేయని తప్పుని అందంగా చిత్రిస్తున్నారు!

సమాజంలో మూఢనమ్మకాలు, ఛాందసభావాలు, త్రుప్పుపట్టిన ఆచారాలు కులమతభేదాలు, పల్లెల్లో, గ్రామాల్లో ఇంకా పాతుకుపోయివున్నాయి కొన్ని చోట్లవ్వి వేళ్ళూని చిగురిస్తునే ఉన్నాయి.

నేడు సమాజపు వ్యవస్థ మారింది. కాలం ప్రవాహంలా ఉప్పొంగుతూ దరి త్రను ముందుకు తీసుకుపోతోంది. సమాజం ఒక రకమైన యుగసంధిలో కొట్టుకపోతున్నది. ఒకవేపు జీవితాన్ని స్వార్థం. మోనం మింగేసి అర్థం లేకుండా చేస్తున్నది. ఈ మార్పును సమాజం అంగీకరించటం లేదు.

మరొకవేపు అభ్యుదయం వెంట పురోగమిస్తూ, సోషలిజంసాధిస్తున్నా మంటున్నారు. ఆర్థిక, సాంఘిక సమా నత్వపు ద్వారాలను సమీపిస్తున్నా మంటు న్నారు. వాస్తవానికి నేడదేమీ కని పించటం లేదు. నాగరికత, సభ్యతల పేరుతో రంగులు పూసుకుని, మనస్సు లను మలినపరచుకుని ఆత్మవంచన చేసు కుంటున్నారు.

ఎటు పయనిస్తున్నారో వాళ్ళకే తెలి యదు. ఆలోచిస్తున్నకొలదీ సమాజం పురోగమిస్తోందో, తిరోగమిస్తోందో రాంబాబుకు అర్థంకావటం లేదు.

సమాజం తాలూకు కనీస అవసరాల్ని గుర్తించని అభ్యుదయం, నాగరికతా ఎందుకు? కాల్చనా! ఆలోచనలతో రాంబాబు తల వేడెక్కిపోయింది. సమాజంలోని వర్గ తారతమ్యాలపట్ల, పద్ధతిమీదా కసి కలుగుతోంది. ఆవేశం అవధులు దాటుతోంది.

సాయంత్రంవరకూ రాంబాబు గది లోనే ఉండిపోయాడు. ఆలోచనలతో.

పట్టుదల, స్థిరనిశ్చయం అతనిలో పాతుకు పోయాయి.

నూతిదగ్గరకు వెళ్దామని లేచి గుమ్మంలో చెప్పులు తొడుక్కుంటూ వుంటే, అన్నగారు వచ్చారు. అన్నగారికి ఏనాడూ తాను ఎదురుచెప్పలేదు.

"ఏమిట్రా రాత్రి ఏదో..." అని అన్నయ్య ఏదో చెప్పబోతున్నంతలోనే రాంబాబు "అన్నయ్యా! ఉదయం అంతా విన్నాను. మీరంతా నన్ను అపార్థం చేసుకున్నారు. నేనేమీ తప్పుపని, కాని పని చేయటంలేదు. ఏమైనా నేను నా నిర్ణయాన్ని మార్చుకోవటం కష్టం" అన్నాడు దృఢంగానే.

"ఈరోజు నుండి అక్కడకు వెళ్ళితే వాడికీ, ఇంటికీ ఋణం తీరిందని చెప్పరా!" అన్నాడు పతంజలిశాస్త్రి వేదనతోను, క్రోధంతోను దేవుని గదిలో నుండి పెద్దకొడుకు నుద్దేశించి.

తండ్రి పట్టుదల తనకు తెలుసు. "మీ యిష్టమే నాన్నగారూ!" అంటూ రాంబాబు తాటితోపులవేపు నూతి దగ్గరకు వెళ్ళిపోయాడు.

* * *

మాలపల్లె ప్రజలంతా నూతిని ఉత్సాహంతో తవ్వుతున్నారు. నాలుగు నిలువుల లోతువరకూ తవ్వారు. రాంబాబు వారికి ఉత్సాహాన్నిస్తున్నాడు. వాళ్ళు కాయశక్తులా మరింత ఉత్సాహంతో పని చేస్తున్నారు.

తవ్వుతున్న గునపాలు "ఖంగు" మన్న శబ్దంతో ఒక్కసారిగా ఆగిపోయాయి. అంతా ఆశ్చర్యపోయారు. వారి మనసులనిండా నిరుత్సాహం నిండిపోయింది. ధైర్యం సడలిపోయింది.

రాంబాబు విశ్వాసాన్ని కూడగట్టుకున్నాడు. ధైర్యాన్ని హృదయం నిండా నింపుకున్నాడు.

మరునాడు రాతిని బద్దలుగొట్టటానికి మందుగుండు సామాను తెప్పించారు.


రాతిని పేల్చారు. అందరూ ఆశతో చూశారు. కాని నిరాశే ఎదురైంది. రాయి పేలినా ఇంకోరాయి తగిలింది.

మళ్ళీ రెండుమూడుసార్లు పేల్చారు. కాని లాభంలేక పోయింది.

"బాబూ! లోపల రాతికొండ వున్నట్లుగా వుంది" అన్నాడు మాలపల్లెలోని తలనెరసిన వృద్ధుడొకడు. అందరి ముఖాల్లోను నిరాశ, నిరుత్సాహం, దైన్యం గూడుకట్టుకున్నాయి.

పనులు మానుకుని, తిండితిప్పలు సైతం లేక రాత్రింబవళ్ళు ఎంతో శ్రమించారు. కాని వారి బ్రతుకు ఎడారిలోని ఎండమావిలా అయిపోయింది. వారి ఆశలన్నీ పేకమేడలై కూలిపోయాయి. బూడిదలోపోసిన పన్నీరులా వారి శ్రమ వ్యర్థమైపోయింది.

కర్తవ్యం గోచరించని సమయంలో వెనుతిరిగి వెళ్ళిపోయారు ఇళ్ళకు పని చేస్తున్నవాళ్ళంతా. వెళ్ళిపోతున్న వారి




వేపు కళ్ళప్పగించి చూడటమే తప్ప రాంబాబు వారిని వారించలేకపోయాడు.

ఏరోజుకారోజు శ్రమిస్తేనేకాని పొట్ట గడవని దౌర్భాగ్యపు బ్రతుకుల్ని ఇంత కాలం ఆశపెట్టి, హింసపెట్టి నుయ్యి తవ్వించాడు, వాళ్ళ సుఖంకోసం. ప్రాణం వుంటేకదా సుఖం అనుభవించడానికి!

రాంబాబుకి అటువంటి సమయంలో ఏంచేయాలో తోచలేదు.

అప్పటికే తెల్లవారుఝామైపోయింది చీకటిని వెలుగురేఖలు తరుముతున్నాయి. రాంబాబు గంగా ఇద్దరే నూతిలో మిగిలిపోయారు. రాంబాబు ఇంటికి వెళ్ళలేదు

"బాబూ!" అంది గంగ గాద్గదికంగా నిశ్శబ్దాన్ని పారదోలుతూ.

ఆలోచిస్తున్న రాంబాబు గంగవేపు చూశాడు. ఆమె నుదిటిమీద స్వేదబిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి కనుకొలకుల్లో కదులుతున్న కన్నీరు స్పష్టంగా కన్పిస్తోంది.

"గంగా! ఏమిటిది?" అన్నాడు రాంబాబు చలించినవాడై.

"అవును బాబూ! శ్రమకు తగ్గ ఫలితం దొరకలేదు ... మాకోసం మీరింటికి దూరమయ్యారు. మీలాంటివారికి కష్టాలు కలిగించిన మమ్మల్ని దేవుడు గూడా సెమించడు బాబూ! ఈ దిక్కుమాలిన దరిద్రపు బ్రతుకుల్ని ఎవ్వరూ బాగుసేయలేరు. ఈ దురదృష్టవంతులపై ఆ గంగమ్మకుకూడా దయలేదు బాబూ!" అంది గంగ వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ. రాంబాబును చూస్తుంటే గంగ గుండెలు కరిగిపోతున్నాయి.

గంగ అభిమానానికి రాంబాబు విచలితుడై పోయాడు.

నిరాశా నిస్పృహ దూరమై అతనిలో

పురుషత్వం మేల్కొంది. కర్తవ్యం జాగృతమైంది. గంగ కన్నీళ్లు తుడిచాడు.

"లేదు గంగా! ఎవ్వరూ నన్ను వదల్లేదు. నేనే వారందర్నీ వదిలేశాను. మనిషిని అర్థం చేసుకునే సంస్కారం వారిలో లేదు. దేవుడు మన కన్యాయం చేయడు. శ్రమకుతగ్గ ఫలితం తప్పక మనకు లభిస్తుంది. ఇక్కడ నీరు పడుతుందనే విశ్వాసం నాకు పూర్తిగా వుంది. ఇక్కడ నీరు తెప్పించడానికి నా ప్రాణాల్నికూడా లెక్క చేయను" అన్నాడు ఆవేశంగా గునపాన్ని తీసుకుని రాతిమీద గట్టిగా పొడుస్తూ.

ఉదయపు ఎండ చుర్రుమంటోంది రాంబాబు రాతిమీద వేస్తున్న గునపం చిన్నచిన్న ముక్కల్ని ఛేదిస్తూ ఖంగు, ఖంగుమనే శబ్దాన్నిస్తోంది.

నాయుడూ, అతని భజంత్రీలు (బంటులు) నూతిదగ్గరకు వచ్చారు. రాంబాబు, గంగ పడుతున్న శ్రమను గట్టుమీదనుండి చూస్తున్నారు. రాత్రి రెండో ఆట సినిమా చూసుకుని ప్రొద్దున్నే పట్నంనుంచి వస్తున్నవారు నూతిదగ్గరకు వచ్చారు చూద్దామని.

"ఏమయ్యా, పంతులూ! నీళ్ళు కావాలని రాళ్ళు సంపాదించావా? నీరు మాటకేంగాని నీ వ్యవహారం జోరుగా సాగుతోందే!" నాయుడు కోరమీసాల మధ్య నుండి విషపునవ్వుతో కూడిన మాటలు!

అక్కడ చేరినవారిలో ఒకరిద్దరు తప్ప మిగిలినవారంతా రాంబాబును హేళన చేసినవారే.

"నూతిలో బండపడితే కొండంత డబ్బు కావాలిరా, ఈళ్ళ తరమే, నీళ్ళు తేవడం" కొందరి వ్యాఖ్యానం.


"ఈ నూతిలో నీళ్ళుపడితే ఆకాసంలోని చుక్కలు క్రింద రాలిపడవూ!" అంటూ మరికొందరి సవాలు. అలా అనుకుంటూ క్రమంగా అక్కడనుంచి అందరూ వెళ్ళిపోయారు.

అవమానంతో రాంబాబు రెచ్చిపోయాడు. వాళ్ళ మాటలు సహించలేకపోయాడు. అతనితో పట్టుదల ద్విగుణీకృతమైది. ఆవేశంగా గునపం తీసుకున్నాడు. రాతిని పగలగొట్టసాగాడు. పగిలిన రాళ్ళను గంగ తట్టకెత్తసాగింది.

గంట గడిచింది రాంబాబు కొంత వరకు రాతిని ఛేదించగలిగాడు. అలసిపోయి నీరసంగా గునపాన్ని ప్రక్కకు పెట్టి కూర్చుండిపోయాడు. చేతులు ఎర్రగా కందిపోయి మంటలు పెడుతున్నాయి. చెంబులోవి మంచినీళ్ళు కొంచెం తాగాడు.

"ఇప్పుడే వస్తానుండు బాబూ!" అంటూ గంగ లేచి వెళ్ళిపోయింది.

రాంబాబు బాధతో తల పట్టుకున్నాడు. ఆలోచనలు ముసిరి వేస్తున్నాయి. "నూతిలో నీరు పడాలి. అదే తన జీవితంలో మొట్టమొదటిదీ – చిట్టచివరీ కోరిక."




ఆశల చివరి అంచుమీద అతని మనస్సు నిల్చున్నది.

"భగవాన్ ! నా ఆశ నిరాశ చేయకు" అన్నాడు పొక్కిలు పొక్కిన తన చేతుల్ని దగ్గరికి చేర్చి నమస్కరిస్తూ.

గంగ మెరపులా వచ్చింది నీళ్ళకడవ తోనూ కాఫీ చెంబుతోను.

"ఎందుకు గంగా నీకీ శ్రమ?" అన్నాడు రాంబాబు కాఫీ త్రాగుతూ.

"శ్రమేమిటి బాబూ, ఇది మా ధర్మం." అంది గంగ మెల్లగా.

రాంబాబు కాఫీ త్రాగి విరిగివున్న రాయిపై చేయివేసి అంతా తడిమాడు. చేతికి చల్లగా తగిలింది రాయి. వెంటనే రాంబాబు రాతికి చెవి దగ్గరగాపెట్టి చేతితో తడుముసాగాడు అనుమానంగా. రాతిక్రింద ఏదో సన్నని ధ్వని...అడుగున నీరు ప్రవహిస్తున్నట్లుగా జలజలమనే సవ్వడి లీలగా వినిపించసాగింది. ఏదో వింత అనుభవం కలగసాగింది. రాంబాబు ముఖం వికసించింది. హృదయంలో సంతోషం కట్టలు త్రెంచుకుంది.

"గంగా!" అన్నాడు రాంబాబు ఆనందం అంచులుదాటగా.

"బాబూ!" అంది గంగ కంగారుగా.

"మన శ్రమ ఫలితానికొస్తోంది. నూతిలో నీరు తప్పక పడుతుంది. రాతిక్రింద నీరు పారుతోంది" అన్నాడు రాంబాబు గర్వంగా.

"నిజమా!" అంది గంగ ఆశ్చర్య

పోతూ. "అయితే మా వాళ్ళందర్నీ పిలుచుకువస్తాను బాబూ!" అంది సంతోషంగా.

"అపుడే వద్దు గంగా. ఎవర్నీ పిలవద్దు. మనమే పగలగొడదాం రాతిని" అన్నాడు రాంబాబు.

రాంబాబుకు వేయి ఏనుగుల బల మొచ్చింది.

మధ్యాహ్నం గంగ అన్నం తెచ్చే వరకూ రాంబాబు రాతిని పగలగొడు తునే వున్నాడు. అతని చెవుల్లో నీటి గలగల శబ్దాలు ఇంకా భ్రమిస్తునే వున్నాయి.

సాయంకాలంవరకూ రాంబాబు రాతిని గునపాలతో బ్రద్దలుకొడుతూనేవున్నాడు. రాంబాబు చేతినుండి రక్తాలు స్రవించటం మొదలెట్టాయి.

సహజంగా కష్టజీవియైన గంగ కాపని కష్టమనిపించలేదు. రాంబాబు చేతుల నుండి స్రవిస్తున్న రక్తం, రాతిమీద అక్కడక్కడ పడింది.

సాయంకాలం కాఫీ తెచ్చిన గంగ ఆ దృశ్యం చూసి కళ్ళనీరు పెట్టింది. రాంబాబు చేతులకు నూనె రాసింది. మాలపల్లెలోని కొందరువచ్చి,

"బాబూ! తమకేటి పిచ్చిపట్టిందా! అంతలావుకొండపడితే నూతిలో నీరు పడతాదా! ఎందుకొచ్చిన శ్రమబాబూ, తవ్వడం మానేయండి" అన్నారు.

రాంబాబు వారి మాటలు వినలేదు. అతనిలో పట్టుదల మరింత బిగిసి పోయింది.

సంధ్య వెలుగులు తొలగిపోయి చీకటి రేఖలు అంతటా పరుచుకుంటున్నాయి.

లాంతరు వెలిగించి అన్నం తెస్తానని వెళ్ళిన గంగ యింకా రాలేదు. రాతి మీద గునపం శబ్దం ఖంగు ఖంగు మంటోంది. రాంబాబు ఒకప్రక్క రాతిని పగులగొడుతుంటే, మరొకప్రక్క ఆలో చనలు ముసురుతున్నాయి.

తాను బ్రతికుండగానే తనవాళ్ళు తనతో సంబంధాలు తెంపుకున్నారు. తాను బ్రతికుండగానే తండ్రి తనకి కర్మ చేసేశాడు. ఎవరి పట్టుదలలు, ఎవరి విశ్వాసాలు వారివి. ఎవరి జీవనవిధానం వారిది. తన జీవితానికి గమ్యస్థానం ఏమిటో తనకే తెలియదు. ఈ నుయ్యి తన జీవితాన్ని ఒక దారుణమైన మలుపు తిప్పిందనుకున్నాడు. మనస్సులో తండ్రి, అన్న, వదిన...పిల్లలు లీలగా మెది లారు. వంటరితనానికి నేస్తంగా కటిక చీకటి, దారుణమైన నిశ్శబ్దం – రెండే మిగిలాయి తనకి.

తెల్లవారుఝాము కాబోతోంది. గంగ అంతవరకూ రాకపోవడానికి కారణం అర్థంకాలేదు రాంబాబుకు. రాత్రంతా నిద్రలేదు. తిండిలేదు. కళ్లు, కాళ్లు తేలి పోతున్నాయి. నీరసంగా, నెమ్మదిగా, వాడిపోయినపువ్వులా వున్న ఓ ఆకారం తనదగ్గరికి వస్తోంది.



గంగని పోల్చుకున్నాడు రాంబాబు. ఆమె కాళ్ళు తడబడుతున్నాయి. ఆకు పచ్చని నేతచీర చిరిగిపోయివుంది. నల్ల చుక్కల రవికె చిరిగి పీలికలుగా భుజం మీదా, వీపుమీదా వేలాడుతున్నాయి. చేతులకున్న మట్టిగాజులు పగిలినట్లుగా మంచమీది రక్తం! జుత్తంతా చిందర వందరగా రేగివుంది. ముఖం మీద అక్కడక్కడ గాట్లు! పల్లెటూరి పసిమీ, మిసిమీ పుణికిపుచ్చుకున్న బంగారు బొమ్మలాంటి గంగ మిలమిల మెరిసే నయనాలు, దొండపండులాంటి పెదాలు–యివన్నీ....యివన్నీ ఎవరో బలవంతంగా అనుభవించినట్లుగా... సర్వమూ కోల్పోయినవ్యక్తిలా గంగకనిపించింది.

"ఏం జరిగింది గంగా?" ఆవేదనతో కూడిన ఆత్రుతతో రాంబాబు ప్రశ్నించాడు.

"ఏం జరగకూడదో అదే జరిగింది బాబూ...ఇంటికెళ్ళి అన్నంవండి మీకు భోజనం తీసుకొచ్చేటప్పటికి చాలా రాత్రయ్యింది. గబగబా వస్తున్నాను.

చుట్టూ చీకటి! వంటరిగా వస్తున్న నన్ను...నాయుడు .. మధ్యలో...... ఆపి... బలవంతంగా... అన్యాయానికి పూనుకున్నాడు...ఎంత పెనుగులాడినా లాభం... లేకపోయింది... నా నోరు నొక్కేశాడు...నా జీవితాన్ని...నాశనం చేసేశాడు బాబూ!" అంది గంగ భోరున ఏడుస్తూ ముఖానికి రెండుచేతులూ అడ్డం పెట్టుకుని.

రాంబాబు అర్థంచేసుకున్నాడు. అతని లోని విద్రాణమైన దానవత్వం మేల్కొంది. ఆవేశంపట్టలేకపోయాడు. తనవల్లనే గంగకీ పరిస్థితి సంభవించింది! క్రోధం, పగ అతని మానవత్వాన్ని తాటాకుల మంట మండించింది! చేతిలో గునపం మారణాయుధంలా మెరుస్తోంది – అతనిలోని పగకు పదును పెడుతూ.

"నాయుడూ!" అంటూ గునపాన్ని రాతిమీద బలంగా పొడిచాడు. పగతీర్చుకోడానికి అంత బలమైన పోటు అనవసరం. అందులో సగంచాలు. కానీ, పగిలినవాలులో పాతాళగంగ ఒక్కసారిగా జుయ్యమని బయటకు చిమ్మటానికి మటుకు అంతబలమూ తోడ్పడింది. ఏనుగుతొండంవంటి ధారతో బుసలుకొట్టే నాగులా లేచింది జలధార.

పతనమైన గంగ...పాతాళగంగతో తడిసి పునీతమైంది. అంత దుఃఖంలోనూ గంగ ఆనందానికి అవధులు లేకపోయాయి. మెరిసే కళ్ళతో నీటివంక చూసింది. ఆవేశంతో తన శరీరాన్ని తడుపుతున్నది – ఇన్నాళ్ళకు తిరిగి అవతరించిన పాతాళగంగ.

"గంగా!" అంటూ రాంబాబు ఆనందం పట్టలేక ఆవేశంతో గంగను కౌగలించుకున్నాడు! విజయం సాధించానన్న తృప్తి, గర్వం అతని కళ్ళల్లో తొంగిచూస్తున్నాయి. మోకాలు లోతు నీరు వచ్చేవరకూ...వారికి బాహ్యస్మృతి రాలేదు.

స్మృతివచ్చిన మరుక్షణంలో పంచ పంచ ఉషఃకాలంలో రాంబాబు.. గంగా మాలపల్లెదాటి వెలుగుబాటలో ఒకరినొకరు ఆసరా చేసుకుని పయనించసాగారు కొత్త జీవితం ప్రారంభించడానికి.